విద్యాభివృద్ధిమస్తు

- నాడు–నేడుతో పాఠశాలలు.. కళాశాల ఆధునికీకరణ
- సకల సౌకర్యాలతో ఆహ్లాదకరంగా తరగతి గదులు
- ప్రభుత్వ విద్యాసంస్థల వైపు విద్యార్థుల చూపు



అభివృద్ధి చేసిన పెడన బ్రహ్మపురంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల

పెడన: నాడు ప్రభుత్వ బడులంటే చిన్న చూపు ఉండేది. సౌకర్యాలు ఉండవని, సరిగా బోధించరని, ఫలితాలు బాగుండవనే భావన ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. పలు పథకాలను అమలు చేసి విద్యాభివృద్ధికి బాటలు వేశారు. అవి మంచి ఫలితాలు ఇస్తున్నాయి. నాడు–నేడు పథకం అమలుతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. డ్యూయల్ డెస్కులు, క్లాస్‌కు గ్రీన్ చాక్ బోర్డు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంటు, కిచెన్ షెడ్డు నిర్మాణం, ల్యాబ్, వాల్ ఆర్ట్స్, మరుగుదొడ్లు, నీటి ట్యాంకుల ఏర్పాటు వంటివి నిర్మించారు.. నిర్మిస్తున్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించారు. కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను అభివృద్ధి చేశారు. సకల సౌకర్యాలు కల్పించారు. ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ పలు పథకాలు అమలు చేయడంతోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

నాడు అరకొర.. నేడు అందరికీ..

నాడు ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు మాత్రమే ఇచ్చారు. ఇవి కూడా అరకొరగానే ఇచ్చారు. నేడు పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో బూట్లు, బెల్టు, రెండు జతల యూనీఫాం, పాఠ్యపుస్తకాలు, టై స్కూలు బ్యాగ్‌లో పెట్టి అందించేలా పటిష్ట చర్యలు చేపట్టారు. ఈ ఏడాది పెడన మండలంలో 4,570 మందికి జగనన్న విద్యా కానుక కిట్లను అందించేందుకు సిద్ధం చేశారు.

మండలంలో 24 పాఠశాలల అభివృద్ధి

పెడన మండలంలో మొదటి విడతగా 24 పాఠశాలలను అభివృద్ధి చేశారు. 16 ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత, రెండు ఉన్నత, ఒక గురుకుల పాఠశాలలో రూ.5.65 కోట్లతో అభివృద్ధి చేశారు. ఆనాటి పాఠశాలల రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. రెండో విడతలో 15 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత, 5 ఉన్నత, 2 అంగన్‌వాడీ కేంద్రాలను రూ.8.98 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ల పోస్టులు భర్తీ

మండలంలోని చెన్నూరు జెడ్పీహెచ్‌ఎస్‌ను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఈ హైస్కూలు ప్లస్‌లో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి ఎంపీసీ, బైపీసీ గ్రూపులను నిర్వహిస్తున్నారు. ఏడు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ల పోస్టులను కూడా మంజూరు చేసి భర్తీ చేశారు. పెడన పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నాడు–నేడు కింద రూ.62.43 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. మరుగుదొడ్లు నిర్మించగా సైన్సు ల్యాబ్‌లు ఆధునికీకరిస్తున్నారు. త్వరలో సెమినార్‌హాల్‌ను నిర్మించనున్నారు.

తల్లుల ఖాతాకు నేరుగా అమ్మఒడి నగదు

తమ పిల్లలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో చదివిస్తే చాలు విద్యార్థుల తల్లుల ఖాతాలో నేరుగా అమ్మ ఒడి పథకం కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.15 వేలు జమ చేస్తోంది. ఇప్పటికే ఈ పథకం మూడు దఫాలుగా అమలు చేసి అందించారు. 2021–22కు సంబంధించి అమ్మఒడి పథకం ద్వారా పెడన మండలంలో 5,384 లబ్ధి పొందారు.

8వ తరగతి విద్యార్థులకు 520 ట్యాబ్‌లు

ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా పాఠాలు చెప్పేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా చేసిన దాఖలాలు లేవు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర సిలబస్‌తో పాటు సెంట్రల్ సిలబస్‌లో శిక్షణ ఇచ్చేందుకు 2024–25 ఏడాదిలో పదో తరగతి సెంట్రల్ సిలబస్‌లో పరీక్షలు రాయడానికి ఈ ట్యాబ్‌లను ప్రవేశపెట్టింది. ఒక్కో ట్యాబ్ కు రూ.16,500 వెచ్చించింది. మండలంలో మొత్తం రూ.85.80 లక్షలు వెచ్చించింది. ట్యాబ్‌లు ద్వారా పాఠాలు బోధించేందుకు బైజూస్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.15,500 ఖర్చుపెడుతోంది. పెడన మండలంలో 520 మంది విద్యార్థులకు ట్యాబులను అందజేశారు.


నాటి మరుగుదొడ్లు...


నేడు ఆధునికీకరించిన మరుగుదొడ్లు... వెనుక తాగునీటి ఆర్వో ప్లాంటు షెడ్డు


నాడు వంట ..తరగతి గదులు


నేడు వంట గది... తరగతి గది

పేదల చదువుకు భరోసా



నేను చదువుకున్న రోజుల్లో పాఠశాలల్లో ఇన్ని సౌకర్యాలు లేవు. మా పిల్లలను బాగా చదివించాలని ఉంది. పాప మోబినా నాలుగో తరగతి పూర్తి చేసి ఐదో తరగతిలోకి వెళ్తుంది. బాబు గౌస్ ఒకటో తరగతి పూర్తి చేసి రెండో తరగతిలోకి వెళ్తాడు. ఎంపీపీ పాఠశాల (బంగ్లా స్కూలు)లో చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం కూడా ఏర్పాటు చేయడమే కాకుండా జగనన్న గోరుముద్ద, యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, బూట్లు కూడా ఇస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లల చదువుకు ఇంత కంటే ఏం కావాలి.

– మహమ్మద్‌బాబు, 16వ వార్డు, పెడన

ట్యాబ్‌ల ద్వారా పాఠాలు



ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్యాబ్‌ల ద్వారా బైజూస్ సంస్థతో ఒప్పందం చేసి 8వ తరగతిలో పాఠాలు నేర్పించారు. ప్రస్తుతం భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి పూర్తి చేశా. తొమ్మిదో తరగతిలోకి ప్రవేశిస్తా. ట్యాబ్ ద్వారా పాఠాలు చాలా బాగున్నాయి. సులభంగా అర్థమవుతున్నాయి. ఉపాధ్యాయులు కూడా బాగా చెబుతున్నారు. అమ్మఒడి ఇప్పటికి మూడు దఫాలుగా అమ్మ ఖాతాకు జమ అయ్యాయి.

– వార్త హేమమల్లిక, బ్రహ్మపురం, పెడన

మా పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే



నాకు ముగ్గురు పిల్లలు. పెద్ద పాప మైమున్నీసా బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం సీఈసీ పూర్తి చేసింది. బాబు ఎండీ గౌస్ పది పూర్తి చేశాడు. చివరి పాప పకూర్‌బీ తొమ్మిది నుంచి పదిలోకి అడుగు పెట్టింది. అప్పటి బడులు బూత్‌బంగ్లాలుగా ఉండేవి. ఇప్పుడు విద్యుత్ సౌకర్యంతో పాటు పాఠశాలలు ఎంతో బాగున్నాయి. ఉపాధ్యాయుల పనితీరు కూడా మెరుగుపడింది. బడులు, కళాశాలల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు.

– షేక్ మహబూబ్‌బాషా, టైలర్, 16వ వార్డు, పెడన

వైభవంగా పోతురాజు ఘటాల ఊరేగింపు


శుద్ధి చేసిన ఘటాలతో ఊరేగింపుగా గ్రామానికి వెళ్తున్న దీక్షాపరులు

రేమాలవారిపాలెం(నాగాయలంక): గ్రామంలోని పోతురాజుస్వామి దేవస్థానంలో వార్షిక జాతర మహోత్సవం శనివారం కోలాహలంగా ప్రారంభమైంది. స్వామి వారి ఘటాలను కృష్ణానదిలో జాతర పూజారులు శుద్ధిచేసి ప్రత్యేక క్రతువు జరిపారు. గత ఏడాది జాతర అనంతరం భద్రపరిచిన ఘటాలను బయటకు తీసి నదీ జలాలతో శుద్ధి చేసి జాతర సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ఘటాలను దీక్ష చేపట్టిన యువకులు తలపై ధరించి ఊరేగింపు అగ్రభాగాన నడవగా డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ప్రధాన వీధుల గుండా గ్రామానికి చేరుకుని జల్దిలో ఉంచారు. అనంతరం ఘటాలకు గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రంతా గ్రామంలో తిరిగి ఆదివారం తెల్లవారుజామున ఘటాలు గుడికి చేరుకోవడంతో ఆచారవంతులచే గుడి జాతర ప్రారంభమవుతుందని, అనంతరం భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటారని నిర్వాహక కమిటీ ప్రతినిధులు చెప్పారు.

పుచ్చగడ్డలో రెండు ఇళ్లు దగ్ధం


కాలిపోయిన పవర్ టిల్లర్లు చూపుతున్న సత్యనారాయణ

లక్ష్మీపురం(చల్లపల్లి): లక్ష్మీపురం పంచాయతీ పరిధి పుచ్చగడ్డలో అగ్ని ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన గొరిపర్తి వెంకటేశ్వరమ్మ తాటాకు తడికలు, రేకుల పైకప్పు కలిగిన ఇంట్లో జీవిస్తోంది. ఆమె ఇటీవల బంధువుల ఇంటికి వెళ్లి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఇంట్లో సామాన్లు పూర్తిగా కాలి బూడిదగా మారాయి. పక్కనే చెల్లుబోయిన వీరవెంకట సత్యనారాయణకు చెందిన ఇంటిలో వ్యవసాయ సామగ్రి ఉంచుకోగా అవి పూర్తిగా కాలిపోయాయి. సత్యనారాయణకు చెందిన రెండు పవర్ టిల్లర్లు, రెండు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు, వ్యవసాయ సామగ్రి కాలిపోయాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు ఆర్పి నష్టం వివరాలు సేకరించారు.

కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపు



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్త, చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, జి. పృథ్వీజ, ఆర్. ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


జి.హర్షవర్ధన్


జి.శశికళ

చల్లపల్లి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు అర్హత సాధించారని ప్రధానోపాధ్యాయులు ఏపీ పద్మనాభరావు తెలిపారు. హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదివిన జి.హర్షవర్ధన్, జి.శశికళ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరిద్దరికీ ఏడాదికి రూ.14 వేల చొప్పున ఇంటర్మీడియట్ వరకు ఉపకార వేతనం లభిస్తుందన్నారు. హర్షవర్ధన్, శశికళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని కొక్కిలిగడ్డ వెంకటేశ్వరమ్మను ప్రత్యేకంగా అభినందించారు.

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి విఘాతం


ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గుడివాడరూరల్: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి విఘాతమని, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాజాతా కళాకారులు పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీన పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం గుడివాడలోని పలు ప్రాంతాల్లో కళాజాతా కళాకారులు ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు పర్యావరణానికి విఘాతమన్నారు. మానవ జీవితంలో అనర్థాలను మిషన్ లైఫ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాతా సభ్యులు ప్రదర్శన ద్వారా ప్రజలకు వివరించారు.

విద్యార్థులకు మొదటి రోజే కిట్లు అందించాలి

పెడన: జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభించిన రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం ఎమ్మార్సీ కేంద్రంలో మండలంలోని హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందు రోజు పాఠశాలను, తరగతి గదులను, పరిసరాలను పరిశుభ్రం చేసేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలకు తరలించేలా రూట్ మ్యాప్‌లు సిద్ధం చేశామని, రూట్ మ్యాప్ ద్వారా మీ పాఠశాలలకు ముందుగానే కిట్లు చేరేలా చూసుకోవాలని చెప్పారు. నాడు–నేడు పనులపై పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉండాలన్నారు. అమ్మ ఒడి పథకానికి సంబంధించిన అర్హుల జాబితాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్నాయని, తల్లులకు సంబంధించి ఈకేవైసీ తీయించుకోవాల్సిన విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చేలా చూడాలన్నారు. జగనన్న గోరుముద్దకు అవసరమైన బియ్యం, కోడిగుడ్లు, చిక్కీల సరఫరాకు సంబంధించిన ఇండెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళి


రైలు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

నాగాయలంక: ఒడిశా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన ప్రయాణికులకు శనివారం రాత్రి నాగాయలంక ప్రధాన కూడలిలో కొవ్వొత్తుల ప్రదర్శనతో గ్రామస్తులు నివాళులర్పించారు. స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ పక్షాలు, ప్రజా సంఘాలు, సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రమాదంలో గాయపడిన వందలాది మంది ప్రయాణికులు త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, వివిధ పక్షాల నాయకులు తలశిల స్వర్ణలత, బీసాబత్తుని ప్రసాద్, వాడపల్లి నాగేశ్వరరావు, షేక్ జాని, లకనం నాగాంజనేయులు, చిట్టా శేఖర్, తంగల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

తలగడదీవి(నాగాయలంక): గ్రామంలోని పురాతన కోదండ రామాలయం పునర్నిర్మాణ పనులకు శనివారం శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. గుంటూరుకు చెందిన బ్రహ్మశ్రీ గుండేపూడి నాగరాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, రాఘవరాణి (ఎంపీపీ) దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 8.30 గంటలకు శివలింగాకారంలోని రాతి శంకువును స్థాపించారు. 150 సంవత్సరాల నాటి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టామని, త్వరితగతిన ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ జనరల్ సెక్రటరీ బండ్రెడ్డి లక్ష్మీనారాయణ, కోశాధికారి చిట్టా శివనాగేశ్వరరావు, వడ్రె రాంబాబు, ముమ్మారెడ్డి సుబ్రహ్మణ్యం, బండ్రెడ్డి బస్వారావు, గోలి సత్యనారాయణ, మండలి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు మేలు

తోట్లవల్లూరు: వైఎస్సార్ జలకళ పథకంతో రైతులకు ఎంతో మేలు కలుగుతోందని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బొడ్డపాడులో వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన బోరు పనులను శనివారం ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్ రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. చినపులిపాక సర్పంచ్ ఆరేపల్లి శివరామకృష్ణ(రాము), ఎంపీటీసీ సభ్యురాలు దారం రోజారాణి, పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి ఫణికుమార్, దారం నాగగోపి, రైతు నాగభైరవ రాజేశ్వరి, బ్యాంక్ డైరెక్టర్ సుభానీ పాల్గొన్నారు.

19న చేనేత కార్మికుల ధర్నా

పెడన: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 19న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు ఇచ్చిందని కమిటీ నాయకుడు కట్టా హేమసుందరరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ధర్నాలో చేనేత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చేనేత కార్మిక సంఘం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, పంచల నరసింహారావు పాల్గొన్నారు.

సినీ గీతాలు ఆలపించిన విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. శనివారం విద్యార్థులు పలు సినీగీతాలు ఆలపించారు. సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వడదెబ్బ తగలకుండా విద్యార్థులకు హోమియో మందులను అందజేశారు. తొలుత భగవద్గీత శ్లోకాలు చెప్పి ధ్యానం చేశారు. కథలు చదివించి ఆటలు ఆడించారు. ఉపాధ్యాయిని విజయ భగవద్గీత 13వ అధ్యాయంలోని 20వ శ్లోకాన్ని నేర్పించి తాత్పర్యాన్ని వివరించారు. జిల్లా ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు. అలాగే ఈడేపల్లి, చిలకలపూడి శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవాలు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్ పేటలోని రంగనాయక స్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వార్ల వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రంగనాయక స్వామి ఆలయంలో రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపైస్వామి వార్లు ఆశీనులు కాగా నగర వీధు ల్లో ఊరేగించారు. బాణసంచా, సన్నాయిమేళం, బిళ్ల పాడు భేతాళ నృత్య ప్రదర్శనలు, భీమవరం తీన్‌మార్ డప్పులు, పాత్తూరు మురళీ కోలాటం బృందాల నృత్యాలతో రథోత్సవం ధూంధాంగా సాగింది. స్వామివార్లను భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కందు ల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. రామలింగేశ్వర స్వామి రథోత్సవం కూడా వైభవంగా జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ ఆంజనేయస్వామి పర్యవేక్షించారు.


వ్యాన్ ఢీకొని రెండు ఎద్దులు మృతి

ఘంటసాల(అవనిగడ్డ): మండల పరిధి జీలగలగండి వద్ద వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో రెండు ఎద్దులు మృతిచెందాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలగలగండి కాలనీ వద్ద శనివారం తెల్లవారుజామున మచిలీపట్నం నుంచి వస్తున్న వ్యాన్ ఎద్దుల బండిని ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు ఎద్దులు మృతిచెందాయి. ఎద్దుల బండి యజమానికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడూరు ఏఓగా శ్రీధర్

కోడూరు: కోడూరు మండల వ్యవసాయాధికారిగా ఎం.శ్రీధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏఓగా పనిచేసిన నందం భానుప్రకాష్ బదిలీపై గుడివాడ సబ్ డివిజన్ పరిధిలోని నందివాడకు వెళ్లారు. దీంతో నందివాడలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ బదిలీపై కోడూరుకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌ను వ్యవసాయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పల్లాలమ్మకు కుంకుమ పూజలు



పాగోలు(చల్లపల్లి): పాగోలు గ్రామదేవత పల్లాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. 24 గంటల పాటు అమ్మవారి ఏకనామ స్మరణ నిర్విఘ్నంగా జరిగింది.

క్లుప్తంగా

కనుల పండువగా తిరు కల్యాణోత్సవం



కోనేరుసెంటర్: వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి తిరుకల్యాణం శనివారం ప్రారంభమైంది. బందరు మండలం తాళ్లపాలెంలోని మంగినపూడి బీచ్ వద్ద భగవాన్ రమణ మహర్షులు సాగర తీర రమణాశ్రమంలో ఉదయం కావడి సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తిరు కల్యాణం, పడి పూజ భక్తిశ్రద్ధలతో జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్న సమారాధనలో వివిధ గ్రామాలకు చెందిన భక్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాధితులకు సాయం



గూడూరు: మల్లవోలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ సభ్యులు మురాల సుబ్బారావు, ప్రత్తిపాటి అలివేలు మంగమ్మ, యాదం రెడ్డి గోపాలరావు, వెలిగారపు వెంకట సాంబశివరావులు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున శనివారం ఆర్థికసాయం అందించామని చైర్మన్ దాసరి రమేష్ తెలిపారు. పీఏసీఎస్ డైరెక్టర్లు దీకుళ్ల రాజు, పీటా శివపార్వతి, సీఈఓ తుమ్మల గణేష్ పాల్గొన్నారు.

వెంకన్నకు వాహన సేవ




కోడూరు: కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్సవ మూర్తులకు వాహన సేవ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించారు. ప్రత్యేక వేదిక వద్ద గరుడ, శేష వాహనాలకు పూజలు చేశారు. కోడూరుకు చెందిన కోట కృష్ణప్రసాద్–వీర రాఘవమ్మ, అద్దేపల్లి శ్యామ్ సుధీర్–హరిత దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. అనంతరం గరుడ, శేషవాహనాలపై స్వామివార్లను ఉంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

లారీని ఢీకొట్టిన ట్రాక్టర్



గూడూరు: మచిలీపట్నం–చల్లపల్లి జాతీయ రహదారిపై గూడూరు మండలం మల్లవోలు పరిధిలో ధాన్యం లోడుతో వెళుతున్న లారీని మట్టి లోడు ట్రాక్టరు ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పొల్లాలోని మట్టిని లోడు చేసుకుని జాతీయ రహదారిపైకి ట్రాక్టర్ వేగంగా వచ్చింది. అదే సమయంలో వచ్చిన చల్లపల్లి నుంచి మచిలీపట్నం వైపునకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీని ఢీకొనడంతో లారీ బోల్తాపడింది. లారీ డ్రైవర్ కె.రవీంద్రబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. గూడూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



కోడూరు: పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై రైతులకు శనివారం అందజేశారు. కోడూరు ఆర్‌బీకే వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఓ ఎం.శ్రీధర్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ తిమ్మన వెంకట నాంచారయ్య, ఏఈఓ సురేష్, వీఏఏలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



కృత్తివెన్ను: గాంధీనగర్ గ్రామంలో విఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.